సాక్షి
నారాయణపేట

శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



కలుషిత నీటితోనే అస్వస్థత

వసతి గృహ విద్యార్థినులు కలుషిత నీరు తాగడం వల్లే అస్వస్థతకు గురయ్యారు.

వివరాలు IIలో ▸



ముగిసిన బాలోత్సవం

పిల్లల పండుగ- బాలోత్సవం శుక్రవారం ఆనందోత్సవాల మధ్య అట్టహాసంగా ముగిసింది.

వివరాలు IVలో ▸

గరిష్టం/కనిష్టం 31.9 /23.2

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

కరువు నేలకు జలాభిషేకం

తలాపునే కృష్ణానది.. నిత్య జలంతో పరవళ్లు తొక్కుతున్నా.. చుక్కనీరు లేక బీళ్లుగా మారిన భూములు.. తడారిన గొంతులు.. బతుకుదెరువు లేక తట్టాబుట్ట చేతపట్టి వలస బోయిన జనం.. బోసిపోయిన ఊళ్లు.. ఇవి ఒకప్పటి 'పాలమూరు' స్థితిగతులకు అద్దంపట్టిన ఆనవాళ్లు. అలాంటి కరువు నేలను తడిపేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పాలమూరు–రంగారెడ్డి' ఎత్తిపోతల ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. కృష్ణమ్మ బిరబిరమంటూ పైకెగసి రానుండగా.. దశాబ్దాల కల నెరవేరనుండడంతో ఉమ్మడి జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాల వ్యక్తమవుతున్నాయి. సీఎం కేసీఆర్ నార్లాపూర్ వద్ద పంప్‌హౌస్‌లో మొదటి మోటారును స్విచాన్ చేసి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన ప్రాజెక్ట్ నిర్మాణం.. చేకూరనున్న ప్రయోజనం తదితర విశేషాలు మీకోసం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

నేడు నార్లాపూర్‌లో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్

- దేశంలోనే అతిపెద్ద సర్జిపూళ్లు, పంప్‌హౌస్‌లు
- 6 జిల్లాలు.. 19 అసెంబ్లీ నియోజకవర్గాలు సస్యశామలం
- 240 మీటర్ల నుంచి 670 మీటర్లకు నీటి ఎత్తిపోత

శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. రోజుకు రెండు టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీల నీటిని ఎత్తిపోసి.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలో 19 నియోజకవర్గాల్లోని 70 మండలాల్లో 12.30 లక్షల ఎకరాలకు సాగు నీరు.. 1,226 గ్రామాలకు తాగు నీటితోపాటు పరిశ్రమలకు మూడు టీఎంసీల నీరందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు.



రేగుమానుగడ్డ వద్ద అప్రోచ్ కెనాల్ హెడ్ రెగ్యులేటర్

పీఆర్ఎల్ఐ పథకం వివరాలు..

మొత్తం రిజర్వాయర్లు	6
లిఫ్ట్ స్టేజీలు	5
నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీలు)	67.52
ముంపు విస్తీర్ణం (ఎకరాలు)	24.724
నీటిని లిఫ్ట్ చేసే గరిష్ట ఎత్తు (మీటర్లు)	670
ఫ్యాక్టరీలకు నీటి కేటాయింపులు (టీఎంసీలు)	3
సాగు నీటి కేటాయింపులు (టీఎంసీలు)	75.94
తాగు నీటి కేటాయింపులు (టీఎంసీలు)	7.15
ముంపు గ్రామాలు	3 రెవెన్యూ గ్రామాలు, 20 పల్లెలు

వ్యయ వివరాలు ఇలా.. (రూ.కోట్లలో)



నిర్మాణ వివరాలు..

అప్రోచ్ కాల్వల పొడవు	12.86 కి.మీలు
ఓపెన్ కల్వాల పొడవు	37.265 కి.మీలు
సొరంగ మార్గం పొడవు	61.577 కి.మీలు
రిజర్వాయర్ల కట్టల పొడవు	74.70 కి.మీలు
మొత్తం పంప్‌లు	34
ఒక పంప్ గరిష్ట సామర్థ్యం	145 మెగావాట్లు
పంప్‌ల విద్యుత్ సామర్థ్యం	4,900 మెగావాట్లు

జిల్లాల వారీగా ఆయకట్టు వివరాలు..

జిల్లా	మండలాలు	గ్రామాలు	ఎకరాలు
నాగర్‌కర్నూల్	8	61	1,03,389
మహబూబ్‌నగర్	13	247	2,35,319
నారాయణపేట	9	155	1,60,955
నల్లగొండ	2	16	29,339
రంగారెడ్డి	20	330	3,59,047
వికారాబాద్	18	417	3,41,951
మొత్తం	70	1,226	12,30,000



నార్లాపూర్ వద్ద టన్నెల్ లోపలి భాగం

ఒక్కో మోటారు బరువు 550 టన్నులు	ఇందులో రూటర్ బరువు 220 టన్నులు	షాఫ్ట్ బరువు 33 టన్నులు
రాగి (కాపర్) వినియోగం 2 టన్నులు	షాఫ్ట్ (కడ్డీ) బరువు 33.5 టన్నులు	ఇంప్లెయిర్ (మోటారు చక్రం) బరువు 36 టన్నులు




ఆర్‌పీఎం (మోటారు తిరగడం)

నిమిషానికి 214.3 సార్లు

సెకన్‌కు 3.57 సార్లు

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆయకట్టు (ఎకరాల్లో)..



34 మోటార్లు.. 24 గంటలు.. 2 టీఎంసీలు పాలమూరు ఎత్తిపోతలకు సంబంధించి పంప్‌హౌస్‌ల్లోని పంపులు ఒక రోజు నడిస్తే రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోస్తాయి.

నార్లాపూర్ నుంచి లక్ష్మీదేవిపల్లి వరకు 140 కిలోమీటర్ల దూరం వరకు నీటిని సముద్ర మట్టం 240 మీటర్ల నుంచి 670 మీటర్లకు నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రస్తుతం నాలుగు రిజర్వాయర్ల వద్ద 34 పంపులు ఏర్పాటు చేయనున్నారు. మొదటి ఫేజ్‌లో మాత్రం రెండు చొప్పున పూర్తి చేసి 7 టీఎంసీల నీటిని తాగునీటి కోసం వినియోగించేలా ప్లాన్ చేశారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌తో ఉమ్మడి పాలమూరులోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల (నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, కొడంగల్, నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, జడ్చర్ల, కల్వకుర్తి, అచ్చంపేట, షాద్‌నగర్) పరిధిలోని 30 మండలాలకు సంబంధించి 463 గ్రామాల్లోని 4,99,663 ఎకరాలకు సాగునీరందనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయి..

ఉత్తర తెలంగాణకు కాళేశ్వరం.. దక్షిణ తెలంగాణకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వరప్రదాయినిగా నిలుస్తుంది. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయి. కాళేశ్వరానికి మించి 145మెగావాట్ల సామర్థ్యంతో మహాబాహుబలి మోటార్లు వినియోగిస్తున్నాం.

– పెంటారెడ్డి, ప్రాజెక్ట్ ముఖ్య సలహాదారు

మిగిలిన పనులు త్వరగా పూర్తి చేస్తాం..

ఇంత పెద్ద ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం కావడం మా అదృష్టం. కరువు జిల్లా పాలమూరు ప్రగతికి ఈ ప్రాజెక్ట్ దోహదపడుతుంది. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రాజెక్ట్ లక్ష్యాన్ని చేరుకుంటాం.

– హమీద్‌ఖాన్, పీఆర్ఎల్ఐఎస్ సీఈ

ఆనందంగా ఉంది..

బీళ్లు వారిన పాలమూరు పంట పొలాలకు కృష్ణమ్మ జలాలు రానుండడం ఆనందంగా ఉంది. సీఎం కేసీఆర్ దృఢ సంకల్పంతోనే ఇది సాధ్యమైంది. ఉమ్మడి జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– బీరం హర్షవర్ధన్ రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే




కొల్లాపూర్ సమీపంలోని సింగోటం చౌరస్తాలో ముస్తాబైన సభావేదిక

సర్వం సన్నద్ధం



- కొల్లాపూర్ బహిరంగసభలో ప్రసంగించనున్న కేసీఆర్
- సీఎం పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ఎత్తిపోతల ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. నార్లాపూర్ వద్ద పంపుహౌస్‌లో మోటారు స్విచ్‌ను ప్రారంభించిన తర్వాత కేసీఆర్ కృష్ణాతీరంలోని హెడ్ రెగ్యులేటరీ వద్ద కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం కొల్లాపూర్ శివారులోని సింగోటం చౌరస్తాలో నిర్వహించనున్న బహిరంగసభలో సీఎం ప్రసంగించనున్నారు.



రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన కళశాలు

కృష్ణాజలాల పంపిణీకి ఏర్పాట్లు

నార్లాపూర్ పంపుహౌస్ వద్ద పైలాన్‌ను సీఎం కేసీఆర్ ఆవిష్కరించిన అనంతరం పంపుహౌస్‌లోని నాలుగో అంతస్తులో మొదటి మోటారు స్విచ్‌ను ఆన్‌చేసి నీటి ఎత్తిపోతలను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి 1.7 కి.మీ. దూరంలో కృష్ణాతీరంలోని హెడ్‌రెగ్యులేటరీ వద్దకు చేరుకుని కృష్ణాజలాల్లో పూలు వదిలి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక్కడి నుంచే ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని గ్రామాలకు కలశాల్లో కృష్ణాజలాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనుంది. ఇందులో భాగంగా అన్ని మండలాల ఎంపీడీఓలు, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు కలశాల్లో కృష్ణాజలాలను గ్రామాలకు తీసుకెళ్లేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఇతరులులోనికి అనుమతించకుండా, ఎక్కడా జనం గుమిగూడకుండా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.



ఎల్లూరు పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్

వరాల జల్లు కురిసేనా..

జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో ఆయన ప్రసంగంపై ఉమ్మడి జిల్లావాసుల్లో ఆశలు నెలకొన్నాయి. బహిరంగసభ వేదికగా సీఎం కేసీఆర్ భారీస్థాయిలో వరాల జల్లు కురిపిస్తారన్న అంచనాలు ఉన్నాయి. ప్రధానంగా శ్రీశైలం ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల్లోని నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించే జీఓ 98పై సీఎం కేసీఆర్ ప్రకటన చేస్తారని భావిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటన కోసం నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని 67 ముంపు గ్రామాలకు చెందిన 1,800 మంది దరఖాస్తుదారులు వేచి చూస్తున్నారు. కొల్లాపూర్ ప్రాంతంలో జీల్‌దార్‌తిప్పకు లిఫ్టును ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసే అవకాశం ఉందన్న ఆశలు నెలకొన్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఉపాధి కల్పనకు పరిశ్రమల ఏర్పాటు, జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు తదితర అంశాలతో పాటు అభివృద్ధి పనులకు నిధులు ప్రకటిస్తారన్న ఆశలు పాలమూరు వాసుల్లో నెలకొన్నాయి.

భారీస్థాయిలో సిద్ధమైన సభా ప్రాంగణం

సింగోటం చౌరస్తా సమీపంలో సాయంత్రం నిర్వహించనున్న భారీ బహిరంగసభకు లక్షన్నర మందిని తరలించేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సీఎం కేసీఆర్ ప్రసంగించే ప్రధాన వేదికతో పాటు లక్షమందికి పైగా ప్రజలు కూర్చునేలా సిద్ధం చేశారు. వర్షం వచ్చినా సభా నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగకుండా టాప్‌రూఫ్‌తో పాటుగా భారీస్థాయిలో సభాప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ఏర్పాట్లపై ఇప్పటికే మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. రాష్ట్రస్థాయిలో సెర్ప్ సీఈఓ గౌతమ్ పొట్రు, ఇతర ఉన్నతాధికారులు, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభాప్రాంగణంలో ప్రజలు వీక్షించేందుకు వీలుగా అక్కడక్కడా భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్షప్రసారం చేస్తూ కొల్లాపూర్ పట్టణంలోనూ ప్రజలు వీక్షించేలా స్క్రీన్‌లను ఏర్పాటుచేశారు. వాహనాల పార్కింగ్ కోసం కొల్లాపూర్– నాగర్‌కర్నూల్ రోడ్డుకు ఇరువైపులా ఏడు చోట్ల ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. బహిరంగసభ ఏర్పాట్లు, నిర్వహణలో రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీ, ఎక్సైజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. సీఎం పర్యటన సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఎస్పీలు, డీఎస్పీలు, సూర్యాపేట, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల నుంచి మొత్తం 3వేల వరకు పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో పాలుపంచుకోనున్నారు.

టెట్ ప్రశాంతం

- 91 శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



లిటిల్‌స్టార్స్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న అడీషనల్ కలెక్టర్ మయాంక్‌మిత్తల్



రవితేజ స్కూల్ వద్ద అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి పంపిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: జిల్లాలో నిర్వహించిన టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)కు 91శాతం అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా గురుకుల, రవితేజ, శ్రీసాయి విద్యాసంస్థల్లో రెండేసి సెంటర్లను కేటాయించారు. ఎస్‌జీటీ అభ్యర్థులకు ఉదయం జరిగిన పరీక్షకు 4,655మందికి గాను 4141మంది హాజరుకాగా, 514మంది గైర్హాజరు అయ్యారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన పేపర్–2కు 3001మందికి 2833మంది హాజరుకాగా 168మంది గైర్హాజరయ్యారు. మొత్తానికి పరీక్ష ప్రశాంతంగా జరగడంతో ఇటు విద్య, రెవిన్యూ శాఖలు, అటు పోలీసు శాఖ ఊపిరి పీల్చుకున్నారు. పరీక్ష ప్రారంభానికి 45నిమిషాల ముందు నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. లోపలికి పంపించే ముందు క్షుణంగా తనిఖీలు చేపట్టారు. ఎలక్ట్రానిక్, ఇతర వస్తువులు బయటను తీసివేయించారు. వివిధ విభాగాలకు సంబంధించి 500మంది పరీక్ష విధులను నిర్వహించారు. ఇక పరీక్షకు హాజరైన అభ్యర్థులకు సంబంధించి చంటి పిల్లలను వారి బంధువులు, కుటుంబ సభ్యులు పరీక్ష కేంద్రం బయట లాలించడం కనిపించింది. పరీక్ష కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిత్తల్, డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని, డీఎస్పీ సత్యనారాయణ తనిఖీ చేశారు.

అభ్యర్థులకు భోజన వసతి

పట్టణంలో జరిగిన టెట్ పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి వేల మంది అభ్యర్థుల రాకతో వారికి అసౌకర్యం కలగకుండా భోజన వసతిని ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్ఆర్ గార్డెన్స్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 2వేల మందికి భోజనం అందించారు. అదే విధంగా గురుకుల పాఠశాల దగ్గర తపస్ ఆధ్వర్యంలో 500మందికి భోజనం అందించారు. ఆర్డీఓ వీరస్వామి, లయన్స్‌క్లబ్ గవర్నర్ హరినారాయణ్ బట్టడ్, డిస్టిక్ సెక్రటరీ మొల్గాన్‌జనార్ధన్, వెంకటయ్య, సాయినాథ్, రవికుమార్‌గౌడ్, ఆత్మారాం, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహా, గుంపుబాలరాజు పాల్గొన్నారు.

మాదాసి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

మక్తల్: మాదాసి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని.. ఎన్నికల ముందు మాదాసి కుర్వలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ ఎంపీ గోరంట్ల మాధవ్, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప అన్నారు. శుక్రవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన మాదాసి, మాదారి కులస్తుల సమావేశం నిర్వహించగా ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కుర్వ కులస్తులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదాసి, మాదారి కుర్వలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, 45 ఏళ్ల నుంచి పింఛన్ అందజేయాలని, గొర్రెలను మేపేందుకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. అలాగే, రాజకీయాలతోపాటు అన్ని విధాలుగా కుర్వలకు అవకాశం కల్పించాలని అన్నారు. ఏపిలో 52 జీఓ నుంచి కుల ధృవీకరణ ఇవ్వడం జరిగిందని తెలంగాణలో ఇదే జీఓ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాదాసి, మాదారి కుర్వ సంఘం వ్యవస్థాపకుడు విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సాయిబాబా, నాగరాజు, బైరి వెంకటేస్, శంకరోళ్ల రవికుమార్, వెంకటన్న, నంద, గజలప్ప, సత్యం పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ భారతి లక్పతి నాయక్

నారాయణపేట: ఓటరు జాబితాను వంద శాతం పారదర్శకంగా సిద్ధం చేయాలని, సరైన ఆధారాలతోనే మార్పులు, చేర్పులు చేయ్యాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ భారతి లక్పతినాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలసి ఆమె తహసీల్దార్లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులతో ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడంలో కీలక పాత్ర పోషించేది ఓటు హక్కు మాత్రమే అన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 2023 ఓటరు జాబితాను సిద్ధం చేయడానికి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ ప్రకారం అన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. డూప్లికేట్ ఓటర్లను తొలగించాలని ఆమె సూచించారు.

554 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాలు కలుపుకొని 554 పోలింగ్ స్టేషన్ ఉన్నాయని... 554 మంది బీఎల్ఓలు, 55 బీఎల్ఓ సూపర్‌వైజర్లు పనిచేస్తున్నరని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఓటరు నమోదు, మార్పు చేర్పులు, మొబైల్ ఈవీఎం మిషన్ పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మయాంక్‌మిత్తల్, అశోక్‌కుమార్, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, ఏఓ నర్సింగ్‌రావు, సి సెక్షన్ సూపరింటెండెంట్ సయ్యద్ ఉమర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం..



మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: దేవుడిచ్చిన మట్టితో వినాయకుని విగ్రహాన్ని తయారు చేసి భక్తి భావంతో పూజించి ఈ ప్రకృతిని కాపాడాలన్నదే ప్రభుత్వ ప్రయత్నమని.. మట్టి గణపతులను తయారు చేయించి అందరికి ఉచితంగా పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅనసూయ, హరినారాయణభట్టడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన


శేఖర్‌గౌడ్ (ఫైల్)

మాగనూర్: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని నల్లగట్టు మారెమ్మవ్వ ఆలయ సమీపంలోని కేజీబీవీ చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ధన్వాడ మండలం మందిపల్లికి చెందిన శేఖర్‌గౌడ్(40) మాగనూర్‌లో తన అక్క ఈడ్గి లలితమ్మ దగ్గరికి ఆరు నెలల క్రితం వచ్చి ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో హిందూపూర్ వైపు నుంచి నల్లగట్టు దగ్గరకు వస్తుండగా హైదరాబాద్ నుంచి నల్లగట్టు సమీపంలో ఇటుకల కోసం వచ్చిన లారీ నడుచుకుంటు వస్తున్న శేఖర్‌గౌడ్‌ను ఢీకొట్టింది. అయితే రాత్రి 8 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరగగా.. లారీ డ్రైవర్ శేఖర్‌గౌడ్ మృతదేహాన్ని రోడ్డు పక్కన పడేసి వెళ్లిపోయాడు. ఉదయం 7 గంటల సమయంలో ప్రమాదం విషయం లారీ ఓనర్‌కు డ్రైవర్ సమాచారం అందించడంతో ఓనర్ స్థానిక పోలీసులకు చెప్పారు. దీంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా లారీ బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు నిర్ధారించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై శేఖర్‌గౌడ్ సోదరి లలితమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని.. వృద్ధుడు

గద్వాల క్రైం: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గద్వాల మండలంలోని వెంకటోనిపల్లికి చెందిన అంజనేయులు(60) బైక్‌పై గద్వాలకు వస్తున్నాడు. అయితే గద్వాల నుంచి ఎర్రవల్లి వైపు శ్రీనివాస్‌రెడ్డి బైక్‌పై వెళ్తుండగా.. జమ్ములమ్మ ఆలయ ముఖద్వారం వద్ద రెండు బైక్‌లు ఎదురెదురు గా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతిచెందగా.. గాయా లపాలైన శ్రీనివాస్ రెడ్డిని స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

రివర్స్ వస్తూ ఢీకొట్టడంతో..

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో రాఘువేంద్ర రైస్ మిల్లు ఎదురుగా రోడ్డు పక్కన్న వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని లారీ వెనుక నుంచి ఢీ కొట్టి పై నుంచి వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలియజేశారు. శుక్రవారం ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లూరు శివారులోని అలంపూర్ చౌరస్తాలో రైస్ మిల్లు వద్ద రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. లారీ రివర్స్ వస్తూ.. అతడిని చూసుకోలేక పైకి ఎక్కించడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ యజమాని మాదన్న, లారీ డ్రైవర్ బొంకూరు గ్రామానికి చెందిన రమేష్‌గా గుర్తించినట్లు తెలిపారు. రాఘువేంద్ర రైస్ మిల్లు గుమస్తా రవికుమార్ ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలియజేశారు. మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


కల్వకోలు శ్రీకాంత్(ఫైల్)

గోపాల్‌పేట: అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేవల్లి మండలంలోని నాగపూర్‌కి చెందిన కల్వకోలు లక్ష్మయ్య కుమారుడు శ్రీకాంత్(28) పెళ్లయి ఇద్దరు కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం సంవత్సరం కిందట వనపర్తి జిల్లా కేంద్రంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపిస్తూ.. జీవనం కొనసాగించేవాడు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో నష్టం రావడం, భార్యకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో అతను మానసిక వేదనకు గురయ్యాడు. సుమారు నాలుగు నెలల కిందట బొద్దింకల నివారణకు వాడే (హిట్) మందు తాగి ఆస్పత్రి పాలయ్యాడు. అప్పటి నుంచి తరచూ అనారోగ్యానికి గురవుతుండేవాడు. ఈ నెల 9న ఆరోగ్యం క్షీణించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ.. గురువారం రాత్రి మృతిచెందాడు. శుక్రవారం శ్రీకాంత్ తల్లి కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వివరించారు.

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

మహబూబ్‌నగర్ క్రైం: రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణంలోని బండమీదిపల్లి సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి(50) మృతదేహం లభించినట్లు వెల్లడించారు. సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడా అనే విషయం తెలియాల్సి ఉందన్నారు. మృతుడి శరీర భాగాలు పూర్తిగా గుర్తించలేని విధంగా మారాయని, సమీపంలో ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కలుషిత నీటితోనే అస్వస్థత?

● వసతి గృహాన్ని పరిశీలించిన అధికారులు
● ఆహార పదార్థాలు, తాగునీటి శాంపిల్స్ సేకరణ
● భయంతో ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థినులు


వసతి గృహంలో విద్యార్థినుల తాగునీటిని శాంపిల్స్ తీసుకుంటున్న అధికారులు

కందనూలు/ నాగర్‌కర్నూల్ క్రైం/ అచ్చంపేట/ మన్ననూర్/ అచ్చంపేట రూరల్: స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ వసతి గృహాన్ని శుక్రవారం అధికారులు సందర్శించి ఆహార పదార్థాలతోపాటు తాగునీటి శాంపిల్స్ సేకరించారు. వసతి గృహంలో గురువారం రాత్రి భోజనం చేసిన తర్వాత సుమారు 50 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతతకు గురైన విషయం తెలిసిందే. అయితే మూడు రోజులుగా విద్యార్థినులు అస్వస్థతతకు గురవుతుండటంతో కలుషిత నీరు తాగడమే కారణమై ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం మొదలుకొని సాయంత్రం వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు వసతి గృహాన్ని సందర్శించి ఫుడ్ పాయిజన్‌కు దారితీసిన పరిస్థితులను ఆరా తీశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మనోజ్, నీలిమ వసతి గృహంలో బియ్యం, చింతపండు, కంది పప్పు, మంచినూనె, తాగునీరు శాంపిల్స్ తీసుకున్నారు. వసతి గృహంలోని వంట గది, తరగతి గదులు, డైనింగ్ హాల్, టాయిలెట్స్, తాగునీటి బోరు తదితర పరిసరాలను పరిశీలించారు. వసతి గృహాన్ని వార్డెన్‌కు బదులు ఆమె పర్యవేక్షిస్తుండటాన్ని అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉన్నతాధికారుల సూచన మేరకు వసతి గృహం ఆవరణలో పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 12 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. అయితే అస్వస్థతతో భయాందోళనకు గురైన విద్యార్థినులు సుమారు 400 మంది ఇళ్లకు వెళ్లిపోయారు. డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, ఐటీడీఏ మేనేజర్ జాఫర్ ఉసేన్, జీసీసీ అకౌంటెంట్ జయ


అచ్చంపేట ఆస్పత్రిలో బాలికలను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

రాజ్, పాఠశాల ఉపాధ్యాయులు వసతి గృహంలో ఉన్న కొంతమంది విద్యార్థినులకు మనోధైర్యం కల్పించారు.

వార్డెన్ సస్పెన్షన్

మన్ననూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్ వార్డెన్ మంగమ్మను కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి సస్పెండ్ చేశారు. గురువారం రాత్రి కలుషిత ఆహారం తిని 180 మంది ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రాజకీయ పార్టీలు, ప్రజలను నుంచి పెద్దఎత్తున విమర్శలు, నిరసనలు వ్యక్తం కావడంతో అధికారులు వార్డెన్ మంగమ్మను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నలుగురే వైద్యులు..

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌భీమా అన్నారు. కనీసం విద్యార్థినులకు చికిత్స అందించలేని పరిస్థితి వంద పడకల ఆస్పత్రిలో నెలకొందని ఆరోపించారు. వంద పడకల ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లు మాత్రమే ఉండటంతో సరైన వైద్యసేవలు అందించలేకపోతున్నారని, ఫలితంగా ఇక్కడి నుంచి నాగర్‌కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మండికారి బాలాజీ, నాగరాజు, రేణయ్య, శ్రీనునాయక్, జలాల్ శివుడు, జానకి, గోలిరాజు, శివచంద్ర, పత్యానాయక్, రవీందర్, తిరుపతయ్య, అనిల్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం..

అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందిస్తామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో, జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వసతి గృహ విద్యార్థినులను శుక్రవారం ఆయన పరామర్శించారు. బాలికల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని గువ్వల చెప్పారు. విద్యార్థినులు అస్వస్థతతో చనిపోయారని కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు తప్పుడు ప్రచారం చేసి తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురయ్యేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శవ రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులను నియోజకవర్గ ప్రజలు పాతాళంలోకి తొక్కేస్తారన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, లోక్యానాయక్ తదితరులున్నారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి విద్యార్థి మృతి


తమ స్నేహితురాలిని చివరిసారి చూసేందుకు వచ్చిన విద్యార్థులు

రిజ్వానా(ఫైల్)

రాజోళి: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలోని మాన్‌దొడ్డిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నభి కుమార్తె రిజ్వానా(12) జ్వరంతో బాధపడుతుంది. ఈ క్రమంలో గురువారం స్థానిక ఆర్‌ఎంపీ మధు వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించుకుని ఇంటికి వచ్చారు. వెంటనే ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో కుటుంబ సభ్యులు కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్యులు వెంటిలేటర్ పైఉంచి చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆర్‌ఎంపీ నిర్లక్ష్యంతోనే అమ్మాయి మృతి చెందిందని బాలిక కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆర్‌ఎంపీ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన తమ తోటి స్నేహితురాలిని చూసేందుకు స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు తరలివచ్చారు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే.. కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఎటకేలకు అల్లాజీ అంత్యక్రియలు

నాగర్‌కర్నూల్ రూరల్: పాలమూరు– రంగారెడ్డిలో భాగంగా వట్టెం వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో 19 ఎకరాల భూమి కోల్పోయి.. సరైన పరిహారం దక్కడం లేదనే మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మండలంలోని కుమ్మెరకు చెందిన అల్లాజీ అంత్యక్రియలు శుక్రవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. భూ నిర్వాసితులకు సరైన పరిహారం అందడం లేదని వివిధ పార్టీల నాయకులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ గ్రామ సర్పంచ్ భర్త తిరుపతిరెడ్డిని అల్లాజీ కుటుంబ సభ్యులతో మాట్లాడాలని సూచించారు. ప్రభుత్వం నుంచి కారుకొండలో ఇచ్చిన పరిహారాన్ని ఇప్పించడంతోపాటు అల్లాజీ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, రూ.5 లక్షల రైతుబీమా ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సర్పంచ్ భర్తనే తనకున్న పొలంలో ఎకరా అల్లాజీ కుటుంబ సభ్యులకు రాసిస్తానని చెప్పడంతో అంగీకరించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భర్త రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అల్లాజీ కుటుంబ సభ్యులకు అందించారు.

సంతలో దొంగల బెడద

● బైక్‌ను చోరీ చేసి తీసుకెళ్తున్న వ్యక్తికి దేహశుద్ధి
● పోలీసులకు అప్పగింత


పట్టుబడిన వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

బాలానగర్: మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంత దొంగతనాలకు అడ్డాగా మారుతుంది. ప్రతి వారం సుమారు 3 నుంచి 6 ఫోన్లు చోరీకి గురవుతున్నాయని సంతలో ప్రజలు, చిరు వ్యాపారులు వాపోతున్నారు. శుక్రవారం జరిగిన వారాంతపు సంతలో ఓ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేస్తూ పట్టుపడగా.. సంతలోని ప్రజలు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇంతలో అక్కడకు చేరుకున్న ఫోన్లు పోయిన బాధితులు.. మా ఫోన్లు కూడా పోయాయి అంటూ పోలీసుల వద్ద మొరపెట్టుకున్నారు. బాలకిష్టయ్య అనే వ్యక్తిది రూ.12 వేల విలువ చేసే ఫోన్ పోయిందని, ఫోన్ కవర్‌లో రూ.4 వేల నగదు ఉందని వాపోయాడు. చింతగూడకి చెందిన నందారం శ్రీనివాసులు దంపతులు రూ.30 వేల విలువ చేసే కొత్త ఫోన్ పోయిందని వాపోయారు. గౌతాపూర్‌కు చెందిన కృష్ణయ్య రూ.14 వేల విలువ చేసే ఫోన్ పోయిందని పోలీసులతో మొరపెట్టుకున్నాడు. ఇది ఇలా ఉండగా ఓ మెకానిక్ దుకాణం నుంచి 3 బైక్‌లు చోరీకి గురయ్యాయని చర్చించుకున్నారు. ఇలా విచ్చలవిడిగా చోరీలు జరుగుతున్నాయని, పోలీసులు నిఘా, గస్తీ పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వేర్వేరు కారణాలతో గంగాపూర్‌లో ముగ్గురి మృతి

జడ్చర్ల: మండల పరిధిలోని గంగాపూర్‌లో శుక్రవారం తీరని విషాదం అలుముకుంది. వేర్వేరు కారణాలతో ముగ్గురు మృత్యువాత పడటంతో గ్రామస్తులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. గంగాపూర్‌కు చెందిన చెన్నకేశవులు దుందుభీ వాగులో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాడు. దీంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగారు. అదే గ్రామానికి చెందిన మంగమ్మ(50) శుక్రవారం తన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

గర్భిణి మృత్యువాత..

ప్రేమించి పెద్దలను ఒప్పించి మెప్పించి వివాహం చేసుకున్న హారిక(25) నిండు గర్భిణి. ఆమె తీవ్ర అస్వస్థతకు గురై జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం మృత్యువాత పడింది. కడుపులోని శిశువుతో పాటు హారిక మృత్యువాత పడటంతో భర్త శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు తీరని విషాదంలో మునిగిపోయారు. ఒకే రోజు గ్రామంలో ముగ్గురు వేర్వేరు కారణాలతో మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

హైవే పోల్‌ను ఢీకొట్టిన అంబులెన్స్

● ఐదుగురికి తీవ్ర గాయాలు
● పేషెంట్‌ను తరలిస్తుండగా ఘటన
● డ్రైవర్ అజాగ్రత్తనే కారణమంటున్న స్థానికులు


హైవే పోల్‌ను ఢీకొట్టిన అంబులెన్స్

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై పేషెంట్‌ను తరలిస్తున్న ఓ ప్రైవేట్ అంబులెన్స్ ప్రమాదవశాత్తు హైవే పోల్‌ను ఢీకొట్టగా నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉండవెల్లి మండలంలోని ఇటిక్యాలపాడుకి చెందిన నారాయణకు ఇటీవల పక్షవాతం రావడంతో కర్నూల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం పేషెంట్‌ను కుటుంబసభ్యులు పెద్దమద్దిలేటి, చిన్న మద్దిలేటి, శ్రీను కలిసి ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఎర్రవల్లిచౌరస్తా సమీపంలోకి రాగానే అంబులెన్స్ డ్రైవర్ రంజిత్ వాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పోల్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైవర్‌తో పాటు అందులోని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి..

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పామాపురం గ్రామ శివారులోని రామన్‌పాడ్ కాల్వ వద్ద ఉన్న నల్లఏనుగు గుట్టపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మిరాసిపల్లికి చెందిన దండుగుల రాజు(31) వడ్డెర పనిచేస్తూ.. జీవనం కొనసాగిస్తుండేవాడు. ఇతనికి పదేళ్ల కిందట వివాహమవగా.. పెళ్లయిన ఏడాదికే భార్య వదిలి వెళ్లిపోయింది. రాజు తల్లిదండ్రులు చనిపోవడంతో పాటు భార్య విడిచి వెళ్లిపోయిందని మానసికంగా సరిగ్గా లేక అక్కడక్కడ తిరుగుతూ.. ఉండేవాడు. కంబాలపురంలోని రాజు పెద్దమ్మ తిరుపతమ్మ వద్ద 10 నెలలుగా ఉంటున్నాడు.

గుట్టపై కుళ్లిపోయిన అస్తిపంజరం..

పామాపురం శివారులోని గుట్టపై కుళ్లిపోయిన అస్తిపంజరం ఉన్నట్టు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, అస్తిపంజరం వద్ద పరిసర ప్రాంతాలను పరిశీలించాడు. సమీపంలో ఖాళీ మద్యం బాటిల్స్, పురుగు మందు డబ్బా లభించింది. మృతదేహం పక్కన ఉన్న టీషర్ట్‌లో ఓ ఆధార్‌కార్డు లభించగా.. అధార్‌కార్డు అడ్రస్ ఆధారంగా బంధువులకు ఫోన్ చేసి పిలిపించుకుని రాజు మృతదేహంగా గుర్తించారు. అయితే అస్తిపంజరం పక్కన దొరికిన పురుగు మందు ఆధారంగా పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు, బంధువులు అనుమానిస్తున్నారు. మృతుడి చిన్నాన్న సుందరయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా.. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలియజేశారు.

ఆశల పల్లకిలో...


ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద బారులుతీరిన అభ్యర్థులు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా జరిగింది. రెండు విడతల్లో ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు అభ్యర్థులు తమ కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన అభ్యర్థులు, సహాయకులతో మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం కిటకిటలాడింది. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించే సమయంలో బారులు తీరారు. కొందరు మహిళా అభ్యర్థులు చంటి పిల్లలతో రాగా.. వారి వెంట వచ్చిన సహాయకులు చిన్నారులను ఆడిస్తూ కనిపించారు.

– సాక్షి, సీనియర్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్


మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


మహిళా అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


పరీక్ష కేంద్రానికి వస్తున్న అభ్యర్థి


అమ్మకు ఆల్ ది బెస్ట్ : పరీక్ష రాసేందుకు వెళ్తున్న తల్లికి బాయ్ చెబుతున్న చిన్నారి


తల్లులు పరీక్ష కేంద్రంలో.. పిల్లలు సహాయకుల వద్ద

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య


నరేష్(ఫైల్)

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లకి చెందిన నరేష్(28) జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. మృతిచెందినట్లు ఎస్ఐ. శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జి.బాలస్వామి కుమారుడు నరేష్ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తుండేవాడు. రెండు నెలల కిందట ఆదే గ్రామానికి చెందిన మహిళతో కలిసి ఇళ్లలో చెప్పకుండా వెళ్లిపోయారు. బంధువులు గ్రామాల్లో వెతికినా సమాచారం దొరకలేదు. చివరగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలో ఉంటున్నట్లు సమాచారం తెలియడంతో ఇద్దరిని కొద్ది రోజుల కిందటే ఎల్కిచర్లకు తీసుకొచ్చి మందలించారు. మహిళను వారి ఇంట్లో వదిలి వేయగా.. నరేష్‌ను తన అక్క వద్ద జడ్చర్లలో ఉంచారు. గురువారం నరేష్ ఎలిక్కచర్లకు వచ్చి వారి వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగాడు. బాధ భరించలేక రాత్రి 11:30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి విషయాన్ని తండ్రి బాలస్వామికి చెప్పాడు. వెంటనే కుమారుడిని ఆటోలో జిల్లా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ యువకుడు శుక్రవారం మృతిచెందాడు. నా కుమారుడి ఆత్మహత్యకు మహిళ కారణమని, తగు చర్య తీసుకోవాలని మృతుడి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ. శ్రీనివాసులు వివరించారు.

మృత్యువుతో పోరాడి ఓడిన అముద

క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

అడుగడుగునా అండగా నిలిచిన 'సాక్షి'

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో 'సాక్షి'కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని 'అయ్యో అముద'శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

మూడు 'రియల్' సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజెన్సీకి వైద్యాధికారులు

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'ఏజెన్సీకి ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రంతోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు నేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూఫ్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

టీచర్ల భర్తీ తర్వాతే...

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

తగ్గిన ఇన్‌ఫ్లో.. నిలిచిన విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు మరింత తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం రాత్రి 8 గంటల వరకు 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం సాయంత్రానికి 5వేల క్యూసెక్కులకు తగ్గింది. దీంతో జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో నీటి కొరత కారణంగా విద్యుదుత్పత్తి నిలిపివేశారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన గుడ్డెందొడ్డి లిఫ్టు-1 వద్ద ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 117 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 60 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,478 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.050 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిండుకుండలా రామన్‌పాడు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో వ్యవసాయ అవసరాల కోసం ఎన్టీఆర్ కాల్వ ద్వారా 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20 క్యూసెక్కులు, రాజీవ్ భీమా ఫేజ్-2 ద్వారా 858 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు ఏఈ రవీల్‌రెడ్డి తెలిపారు.

31.8 అడుగులకు చేరిన కేఎస్పీ నీటి మట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రం వరకు 31.8 అడుగులకు నీటి మట్టం చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా మరో 10 ఇంచుల నీరు చేరితే ప్రాజెక్టు పూర్తి స్థాయికి చేరుకుంటుంది.

ఉమ్మడి జిల్లాలో ఆరు పీహెచ్‌సీ భవనాలు?

పాలమూరు: జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పాటు అయిన కౌకుంట్ల మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణం చేయడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో పాటు ఉమ్మడి జిల్లాలో సింగోటం, కృష్ణ, కొత్తపల్లి, కేటీదొడ్డి, ఉండవల్లిలో పీహెచ్‌సీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలుస్తోంది. దీనిపై మహబూబ్‌నగర్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణను వివరణ కోరగా స్పష్టమైన ఆదేశాలు ఇంకా రాలేదని తెలిపారు.

జల సంబురానికి సిద్ధం


కొల్లాపూర్‌లో సీఎం సభావేదికను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు


పాలమూరు ప్రాజెక్టు పంప్‌హౌస్‌లో కేసీఆర్ ప్రారంభించనున్న మొదటి పంపు స్విచ్‌బోర్డు

- కొల్లాపూర్‌లో సభావేదికను పరిశీలించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కొల్లాపూర్: పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు ప్రారంభోత్సవ సంబురానికి సర్వం సిద్ధమైంది. శనివారం సీఎం కేసీఆర్ ప్రాజెక్టులోని ఒక మోటారును ప్రారంభించనుండగా.. ఇందుకు సంబంధించి నీటి పారుదల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎల్లూరు పంప్‌హౌస్‌లో సీఎం కేసీఆర్ స్విచ్ ఆన్ చేయనున్న ప్యానెల్ బోర్డును ప్రత్యేకంగా అలంకరించారు. పంప్‌హౌస్ వద్ద పైలాన్ ఏర్పాటు చేశారు. నార్లాపూర్ రిజర్వాయర్‌లోని నీటిని ఎత్తిపోసే డెలివరీ పంపింగ్ సిస్టం వద్ద సీఎం కృష్ణమ్మకు పూజలు చేయనున్నారు. ఈ క్రమంలో దేవతామూర్తులను అభిషేకించడానికి సహస్ర కళశాలతో కృష్ణానీటిని నింపి పూజలు చేయనున్నారు. శుక్రవారం రాత్రే సహస్ర కళశాలను లింగాకారం, ఓంకారం, స్వస్తిక్ రూపాలలో అలంకరించారు. కొల్లాపూర్‌లో సభావేదిక ప్రాంగణం నిర్మాణ పనులు సైతం కొనసాగాయి. పనులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ పోలీసు, ఇతర శాఖల అధికారులతో సమావేశమై.. బందోబస్తు తదితర అంశాల గురించి చర్చించారు. సుమారు 3 వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననుండగా.. వెయ్యిమందికిపైగా ఇతర శాఖల అధికారులు విధుల్లో ఉంటారు. ఏర్పాట్ల పర్యవేక్షణ అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ శనివారం మధ్యాహ్నం సీఎం కేసీఆర్ కొల్లాపూర్ చేరుకుని.. నేరుగా పాలమూరు ప్రాజెక్టు పంప్‌హౌస్‌లో స్విచ్ ఆన్ చేసి వెట్‌రన్ ప్రారంభిస్తారన్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద పూజలు చేసిన అనంతరం కొల్లాపూర్‌లో బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. సభకు హాజరయ్యే వారికి పార్కింగ్‌లో ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల వారీగా స్థలాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మంత్రి వెంట నాయకులు రంగినేని అభిలాష్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

అట్టహాసంగా ముగిసిన బాలోత్సవం

- రెండోరోజు ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


విద్యార్థుల జానపద నృత్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: చిన్నారుల ఆటపాటల కేరింతలు ఒకవైపు.. పద్యపఠనం, దేశభక్తి గీతాలాపన మరోవైపు.. మట్టితో బొమ్మల తయారీ, బాల విజ్ఞానుల ప్రయోగ సైన్స్ ఫెయిర్ ఇంకోవైపు.. ఇలా అన్ని వైపులా జిల్లాకేంద్రంలోని బృందావన్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో పిల్లల పండుగ 2వ పిల్లలమర్రి బాలోత్సవం శుక్రవారం ఆనందోత్సాహాల మధ్య అట్టహాసంగా ముగిసింది. రెండోరోజు బాలోత్సవంలో దాదాపు 10 వేదికల్లో చిన్నారులు ఉత్సాహంగా ఈవెంట్లలో పాల్గొన్నారు. బేబీ జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులు ఆయా ఈవెంట్లలో పోటీపడ్డారు. జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయం, సంప్రదాయ నృత్యాలు, దేశభక్తిగీతాలతోపాటు బతుకమ్మ, కథలు చెప్పడం, పద్యంభావం, ఉపన్యాసం, స్పెల్‌బీ, సైన్స్ ఎగ్జిబిషన్, మట్టిబొమ్మలు ఈవెంట్లు నిర్వహించగా విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాలను చక్కగా ప్రదర్శించారు. బాలోత్సవంలో మెజీషియన్ నరేష్ ప్రదర్శనలు ఆకట్టుకుంది. జిల్లాలోని 70 ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన సుమారు 4 వేల మంది విద్యార్థులతో బాలోత్సవం సందడిగా మారింది.

సమష్టి కృషితో..

అందరి ప్రోత్సాహం, సమష్టి సహకారంతో బాలోత్సవం విజయవంతమైనట్లు పిల్లలమర్రి బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బెక్కం జనార్దన్, డాక్టర్ ప్రతిభ అన్నారు. ముమ్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడుతామన్నారు. బాలోత్సవం విజేతలకు జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్, మల్లిక ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ మహేష్‌బాబు, డాక్టర్ ఏగూరు ఇందిర తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాల స్వేచ్ఛ సంస్థ ప్రతినిధి కిరణ్‌చంద్, జగపతిరావు, వీణ శివకుమార్, జగపతిరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులతో కమిటీ సభ్యులు

కష్టపడి పనిచేస్తేనే ఉన్నత స్థాయి

- జేపీఎన్‌సీఈ కళాశాలను సందర్శించిన నటుడు తనికెళ్ల భరణి


జేపీఎన్‌సీఈ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తనికెళ్ల భరణి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కష్టపడి పనిచేస్తే ఉన్నతంగా ఎదుగుతారని నటుడు తనికెళ్ల భరణి పేర్కొన్నారు. జయప్రకాష్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని నటుడు తనికెళ్ల భరణి సందర్శించి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, జయప్రకాష్ నారాయణ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో కష్టపడి పనిచేస్తే ఉన్నతంగా ఎదుగుతారని, క్రమశిక్షణతో ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమ పద్ధతిలో పనులు చేస్తే గొప్పగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఇప్పుడు గొప్ప వ్యక్తులుగా ఉన్నవారందరూ కూడా గతంలో పేదరికం అనుభవించిన వారేనని, పేదలుగా ఉన్నవారు ఎవరూ కూడా నిరుత్సాహ పడకూడదన్నారు. శ్రమించి పనిచేస్తే.. ఖచ్చితంగా ఏదో ఒకరోజు ఎదుగుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ సాధించిన నలుగురు అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ కేఎస్ రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, డైరెక్టర్లు వెంకటకిషన్‌రావు, లింగన్‌గౌడ్ కులకర్ణి, ప్రిన్సిపాల్స్ సుజీవన్, చంద్రశేకర్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో.. సినీనటుడు తనికెళ్ల భరణి

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామిని ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. ఆలయంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులను తనికెళ్ల భరణి పరిశీలించారు. ఆలయాన్ని బాగా అభివృద్ధి చేస్తున్నారని ఆలయ నిర్వాహకులను తనికెళ్ల అభినందించినట్లు తెలిసింది. ఇక్కడి రామలింగేశ్వర స్వామి విశిష్టత చాలా గొప్పదని ఆయన పేర్కొన్నారు.

'హక్కులపై అవగాహన అవసరం'


విద్యార్థులతో మాట్లాడుతున్న అంజన్‌రావ్, అధికారులు

మన్ననూర్: బాలబాలికలు రాజ్యాంగం ద్వార సంక్రమించిన తమ హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ సభ్యుడు అంజన్‌రావ్ సూచించారు. శుక్రవారం మన్ననూర్‌లోని సాంఘీక సంక్షేమ గురుకుల, గిరిజన ఆశ్రమ పాఠశాలను హక్కుల బృందం సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు కుశల ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడంతో పాటూ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కష్టమైనప్పటికీ ఇష్టంతో చదివితే ఆశించిన ఉద్దేశంతో పాటూ అనుకున్న గోల్‌ను సాధించవచ్చని సూచించారు. అధిక మార్కులు సాధించడమే ప్రామాణికం కాదని, ప్రతిఒక్కరూ విద్యతో పాటూ నైతిక విలువలు కలిగి ఉండాలన్నారు. పరిస్థితులను బట్టి విద్యార్థుల ఆరోగ్యంపై వీలైనంత జాగ్రత్తగా ఉండాలని పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పెద్ద మొత్తంలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం దురదృష్టకరం అన్నారు. పాఠశాల నిర్వాహకులతో పాటూ వార్డన్‌కు సహకరిస్తున్న జిల్లా అధికారులపై విచారణ చేసి, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా కలెక్టర్‌తో పాటూ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, కమిషన్ సభ్యులు ఎల్లప్ప, ప్రసన్న, లక్ష్మణ్‌రావ్, వెంకటేష్, శ్రీశైలం, సుదర్శన్, సాహితి తదితరులు పాల్గొన్నారు.